

అన్నాచెల్లెళ్లకు పాము కాటు

సింహాద్రిపురంలో అన్నాచెల్లెళ్లను పాము కాటు వేసింది. అన్న మృతి చెందగా, చెల్లెలి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. -8లో..



మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం శాంతిని నెలకొల్పాలని అఖిలపక్ష కమిటీ నేతలు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు డిమాండ్ చేశారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.9/24.0

జిల్లాలో మంగళవారం 24.0 - 30.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు వేలంపాట

చాపాడు: మండల కేంద్రమైన చాపాడులోని ప్రొద్దుటూరుకు చెందిన నారాయణ రంగయ్య గారి సత్రంకు సంబంధించిన భూములు కౌలుకు ఇచ్చేందుకు బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామచంద్రయ్య తెలిపారు. చాపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 53/3ఏ, 37, 79లో గల 11.28 ఎకరాలకు సంబంధించి ఏడాది సాగుకు వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందస్తుగా రూ.10వేలు డిపాజిట్ కట్టవలసి ఉంటుందన్నారు. ప్రొద్దుటూరు లోని రంగయ్య సత్రం కార్యాలయం వద్దకు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకోవాలన్నారు.

ఎస్ఈకి విద్యుత్ ఉద్యోగుల సమ్మె నోటీసు



ఎస్ఈ రమణకు సమ్మె నోటీసు ఇస్తున్న పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

కడప కార్పొరేషన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి ఆగష్టు 10వ తేది వరకూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ యూఎస్‌కే బర్నవాస్, జనరల్ సెక్రటరీ ఎస్‌కే చాంద్‌బాషా, కన్వీనర్ ఎంవీ చలపతి, జిల్లా జేఏసీ నాయకులు శివభాస్కర్, యాకోబు, శ్రీపతి, జయప్ప, రమేష్ బాబు, ఫయాజ్ బేగ్, ఈఈ నాగరాజు, భరణి, నాగేశ్వరరెడ్డి, క్రిష్ణ, అశోక్‌బాబు, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

పదోన్నతి పత్రాలు అందజేత



పదోన్నతి పత్రాలు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్‌లో రికార్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఆరుగురికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పదోన్నతులు కల్పించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. పాయసంపల్లె హైస్కూలులో పనిచేస్తున్న రత్నకుమారిని పదోన్నతిపై చాపాడు మండలం నరహరిపురానికి బదిలీ చేశారు. సింహాద్రిపురంలో పనిచేస్తున్న కేవీ సతీష్‌రెడ్డిని అదే మండలం అంకాలమ్మగూడూరు హైస్కూలుకు, బద్వేలు బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్.వెంకటసుబ్బమ్మను బద్వేలు ఎంపీపీ కార్యాలయానికి, చిన్నమండెం మండలం మల్లూరు హైస్కూలులో పనిచేస్తున్న అజంతుల్లాబాషను సుండుపల్లె మండలం గుట్టకిందరాచపల్లెకు, కందిమల్లాయపల్లెలో పనిచేస్తున్న పి.గిరిబాబును కలసపాడు, కడప జెడ్పీలో పనిచేస్తున్న జె.రమేష్‌కుమార్‌ను వల్లూరు ఎంపీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఏఓ రంగాచార్యులు, పంచాయతీ రాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నాగిరెడ్డి పాల్గొన్నారు.

బొట్టు..బొట్టు.. ఒడిసి పట్టు



ఇంకుడు గుంత నిర్మాణం (ఫైల్)

- జిల్లాలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం
- ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల ఆవరణాల్లో ఏర్పాటుకు చర్యలు

కడప సిటీ : వరుణుడు కరుణించినప్పటికీ వాన నీటిని ఒడిసి పట్టకపోతే భవిష్యత్తుకు భూగర్భ జలాలు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంటుంది. ప్రతి వాన నీటి బొట్టుబొట్టును ఒడిసి పట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా డ్వామా అధికారులు ఇంకుడు గుంతల ఏర్పాటుకు జిల్లాలో శ్రీకారం చుట్టారు. ప్రతి మండలానికి ఐదు నుంచి పది ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. ప్రారంభంలో ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణాల్లో ఇంకుడు గుంతలు తవ్వేలా ప్రణాళికలు రూపొందించారు. వీటి నిర్మాణం వల్ల భూగర్భ జల మట్టం పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రతి మండలానికి 5 నుంచి 10 చొప్పున నిర్మాణాలు

జిల్లా వ్యాప్తంగా 350 ఇంకుడు గుంతలు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే 222 ఇంకుడు గుంతల ఏర్పాటుకు స్థలాలను గుర్తించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. మిగతా వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలన్న ధీమాతో కసరత్తు ప్రారంభించారు.

ఇంకుడు గుంతల నిర్మాణం ఇలా!

ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఆయా ప్రాంతాల్లో వసతిని బట్టి నిర్మించనున్నారు. పెద్ద సైజు ఇంకుడు గుంతకు రూ. 74,656, చిన్నసైజుకు రూ. 53,200 ఖర్చు చేయనున్నారు. మొత్తం ఉపాధి హామీ కూలీలతోనే ఈ పనులు చేపట్టనున్నారు. సిమెంటు, ఇసుక, కంకర తదితర సామగ్రిని వాడతారు. దాదాపు ఆరు మీటర్ల లోతు ఉండేలా నిర్మాణం ఉంటుంది. కింది నుంచి ఒకటిన్నర మీటరు వరకు 225–300 ఎంఎం కంకర, ఒకటిన్నర మీటరు తర్వాత 150 ఎంఎం కంకర, 0.60 మీటర్ల లోతులో 40 ఎంఎం కంకర, 030 మీటర్లలో 20 ఎంఎం కంకర, 010 మీటర్లలో 1:5:10, 0.30 వెడల్పులో, 030 మీటర్ల దగ్గర ఇసుక, తర్వాత పైభాగంలో ఫ్లైయాష్ బ్రిక్స్‌తో కట్టడంతో ఇంకుడు గుంత నిర్మాణం పూర్తవుతుంది. వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతల నిర్మాణంతో ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేందుకు డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విధానం వల్ల భూగర్భ జలాలను పెంచేందుకు అవకాశం ఉంటుంది.

భూగర్భ జలాల పెంపునకు కృషి



జిల్లాలో భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఆ దిశగా నిర్మాణాలు చేపట్టేలా క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. త్వరలో లక్ష్యం మేరకు ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– యదుభూషణరెడ్డి, పీడీ, డ్వామా, కడప

ఎక్కడెక్కడ?

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు
- మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు
- ప్రభుత్వ ఆస్పత్రులు, బల్క్‌మిల్క్ సెంటర్లు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా పాఠశాలలు
- గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు
- గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ భవనాల వద్ద..

ప్రయోజనాలు

- వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకుతుంది. ఫలితంగా నేల కోతకు గురికాదు.
- భూగర్భ జలాలు సమృద్ధిగా అందుబాటులో ఉంటాయి. బోర్లు తవ్వితే నీరు పుష్కలంగా లభ్యమవుతుంది.
- ఇప్పటికే సాగునీరు అందిస్తున్న బోర్లలో నీటి శాతం పెరుగుతుంది. మరింత విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు.
- పారిశుధ్య నిర్వహణ బాగుంటుంది. రోగాలు దరికి చేరవు.

జిల్లాలో ఇంకుడు గుంతల స్థలాల గుర్తింపు వివరాలు

క్లస్టర్ పేరు	మండలం	గుర్తింపు స్థలాలు
బద్వేలు	అట్లూరు	10
.	బి.కోడూరు	08
.	బద్వేలు	08
.	గోపవరం	07
.	కలసపాడు	09
.	పోరుమామిళ్ల	13
.	కాశినాయన	10
జమ్మలమడుగు	జమ్మలమడుగు	02
.	కొండాపురం	10
.	మైలవరం	02
.	పెద్దముడియం	01
.	ఎర్రగుంట్ల	03
కమలాపురం	చెన్నూరు	04
.	చింతకొమ్మదిన్నె	03
.	కమలాపురం	01
.	పెండ్లిమర్రి	15
.	సిద్దవటం	07
.	వల్లూరు	07
.	వీరపునాయునిపల్లె	03
.	ఒంటిమిట్ట	10
పులివెందుల	చక్రాయపేట	28
.	లింగాల	01
.	పులివెందుల	01
.	సింహాద్రిపురం	06
.	తొండూరు	01
.	వేంపల్లె	06
.	వేముల	09
మైదుకూరు	బి.మఠం	10
.	చాపాడు	03
.	దువ్వూరు	06
.	ఖాజీపేట	08
.	ప్రొద్దుటూరు	03
.	ఎస్.మైదుకూరు	06

ప్రశాంతంగా వైవీయూ పాలకమండలి సమావేశం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వర్చువల్ విధానంలో ఏపీ ఉన్నతవిద్య ముఖ్యకార్యదర్శి శ్యామలరావు, ఏపీ ఉన్నతవిద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి హాజరుకాగా, వైవీయూ పాలకమండలి సభ్యులు, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. సమావేశంలో కోర్టు ఉత్తర్వులు మేరకు విశ్వవిద్యాలయాల్లో నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్‌లను రద్దు చేయడంతో, ఉన్నతవిద్యామండలి ఆదేశాల మేరకు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఆచార్యుల పోస్టులను రద్దు చేస్తూ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. దీంతో పదోన్నతులు పొందిన ఆచార్యులను తిరిగి వారి పూర్వస్థానాల్లో విధులు నిర్వహించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. దీంతో డా. వి. వెంకట్రామ్ (భౌతికశాస్త్రం), డా. ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి (జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్)లను వారి పూర్వస్థానాల్లో నియమిస్తూ వైవీయూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్



జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ మీరా ప్రసాద్

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లాలో వాహనాల ఆర్సీ, వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లాలో 2021 సెప్టెంబర్ 16 నుంచి నేటి వరకు 28,150 ఆర్సీ కార్డులు, 20,500 డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ ఇ.మీరాప్రసాద్ పేర్కొన్నారు. సారథిలో డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించి 52 రకాల సేవలను, వాహన్ సర్వీసుద్వారా 46 రకాల సేవలను సారథి పోర్టల్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. సారథి, వాహన్ సేవలను గత ఆరు నెలల ముందు నుంచి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. వాహనదారులకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు.

విద్యతో పాటు పిల్లలకు ఆరోగ్య భద్రత

- సిలబస్ మేరకు బోధన
- టెన్త్ ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : పాఠశాలల్లో పిల్లలకు విద్యాబోధనతోపాటు ఆరోగ్య భద్రత కూడా తప్పనిసరి అని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపు, ఆరోగ్యం, మన బడి నాడు–నేడు ఫేస్–2 పనుల పురోగతిపై కలెక్టర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. 2023–24 అకడమిక్ క్యాలెండర్‌ను ఎంపీడీఓలు ఖచ్చితంగా అనుసరించాలన్నారు. టెన్త్ పరీక్షా ఫలితాలతోపాటు అన్ని తరగతుల పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై కూడా అవగాహన కల్పించాలని చెప్పారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. సిలబస్ ప్రకారం బోధన సాగుతోందా? లేదా? అనే విషయాన్ని ఆరా తీయాలన్నారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన బాధ్యత ఎంఈఓలదేనన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యుల ద్వారా ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. సచివాలయాల్లోని వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. పిల్లలు ఎవరికైనా ఆరోగ్యపరమైన సమస్యలు, సర్జరీలు అవసరమైతే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఈఓ రాఘవరెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో మహిళా సంఘాలకు ప్రాధాన్యత

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనలో ఔత్సాహిక మహిళా సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అరటి, చీనీ, మామిడి పంటలకు సంబంధించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పి నాణ్యమైన ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పెంపొందించాలన్నారు. దీంతో చాలా మంది రైతులు, మహిళలకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రైమ్ మినిస్టర్ ఫార్మేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజ్ పథకం ద్వారా ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను ఔత్సాహిక రైతు సంఘాల నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పడానికి అవకాశం కల్పిస్తోందని పేర్కొన్నారు. జిల్లాతో పాటు పులివెందుల ప్రాంతంలో అరటి ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీ యూనిట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రోత్సహించాలని చెప్పారు. బ్యాంకుల నుంచి రుణ సహాయం అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, పశుసంవర్ధశాఖ జేడీ శారదమ్మ, ఉద్యాన అధికారి రాజీవ్ మైఖేల్, మెప్మా పీడీ సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులలో వేగం పెంచాలి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు పరిశీలించారు. పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న శిల్పారామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భాకరాపురం సమీపంలోని కృష్ణుడి టెంపుల్ పనులు, క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులతోపాటు పెద్దరంగాపురం సమీపంలోని ఏపీ కార్ల్‌లో నూతనంగా నిర్మించిన నూటెక్ బయోసైన్సెస్ పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలలో ఊర్లు నిర్మిస్తున్నారని.. వాటిని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, డీఎఫ్ఓ సందీప్‌కుమార్, ఏపీ కార్ల్ సీఈఓ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

31న వైఎస్సార్ ఏఎఫ్‌యూ రెండో విడత ప్రవేశాలు



మాట్లాడుతున్న చైర్మన్, కన్వీనర్

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు రెండోవిడత కౌన్సెలింగ్ ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు ఏడీసెట్–23 కమిటీ చైర్మన్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, కన్వీనర్ డా. ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వైఎస్సార్ ఏఎఫ్‌యూలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి బీఎఫ్ఏ పెయింటింగ్, శిల్పం, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్స్, ఫొటోగ్రఫీ, బ్యాచిలర్ ఆఫ్ ఇంటీరియర్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి తొలివిడతలో హాజరుకాలేని విద్యార్థుల కోసం రెండోవిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశాలు పొందగోరు విద్యార్థులు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాల కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత కలిగిన వారందరూ కుల, ఆదాయ ధృవీకరణపత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. కౌన్సెలింగ్ రోజే అభ్యర్థులకు సీటు కేటాయిస్తామని తెలిపారు.

సన్నద్ధం..

- ఓటర్ల జాబితా రూపకల్పనకు యంత్రాంగం చర్యలు ముమ్మరం
- జిల్లాలో చురుగ్గా కొనసాగుతున్న ఇంటింటి సర్వే
- ఓటరు జాబితాలో మార్పులకు అవకాశం
- నెల రోజులపాటు కొనసాగనున్న ప్రక్రియ
- 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే వారికీ అవకాశం



ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా పరిశీలిస్తున్న ప్రభుత్వ సిబ్బంది

కడప కోటిరెడ్డి సర్కిల్/సెవెన్‌రోడ్స్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఓటర్ల జాబితాలోని తప్పులు సరిచేయడం, కొత్త ఓటర్ల నమోదు, సవరణ తదితర అంశాలపై గత శుక్రవారం ప్రారంభమైన ఇంటింటి సర్వే ఆగస్టు 21వ తేదీ వరకు కొనసాగనుంది.

– రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రస్తుతం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేసి 2024 జనవరి 5వ తేదీ తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. ఎన్నికల ఏడాది కావడంతో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలు కూడా దృష్టి సారిస్తున్నారు. ఓటర్లు కూడా తమ ఓటు ఉందా? లేదా? అందులో వివరాలు సరిగా ఉన్నాయా? లేవా? అని సరిచూసుకోవాలి. చిరునామా మారి ఉంటే నియోజకవర్గ పరిధిలో ఓటు బదిలీ చేయించుకోవాలి. 2024 జనవరి 1వ తేది నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలి.

సరిదిద్దనున్న యంత్రాంగం..

ఫారం–8 ద్వారా ఓటరు జాబితాలో ఇంటి నంబరు, ఆధార్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డుల ఆధారంగా తప్పులను సరిదిద్దనున్నారు.

బీఎల్ఓలకు రిజిష్టర్లు, దరఖాస్తులు..

ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే గత శుక్రవారం నుంచి ప్రారంభమైంది. బూత్ లెవల్ అధికారులు ఆగస్టు 21 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. సవరణకు సంబంధించి బీఎల్ఓ రిజిష్టర్లు కొత్తగా ఓటరు నమోదుకు ఫారం–6, ఓటు తొలగింపునకు ఫారం–7, నియోజకవర్గ పరిధిలో ఓటు బదిలీకి ఫారం–8 దరఖాస్తులను నియోజకవర్గాల ఎన్నికల సిబ్బందికి జిల్లా ఎన్నికల యంత్రాంగం అందజేసింది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..



ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ చేపట్టింది. ఓటర్లు దీనిని సద్వినియోగం చేసుకోవాలి. జాబితాలో తన ఓటు ఉందా? ఒకవేళ తప్పులు ఉంటే సరిచేయించుకోవాలి. ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన వారితోపాటు 2024 జనవరి 1వ తేది నాటికి 18 సంవత్సరాలు నిండేవారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

– ధర్మచంద్రారెడ్డి, ఆర్డీఓ, కడప

ఓటరు జాబితా సవరణ షెడ్యూల్

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చేనెల 21వ తేదీ వరకు బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా ఆధారంగా ఓట్ల వివరాలను పరిశీలిస్తారు. వచ్చేనెల 22వ తేదీ నుంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ జాబితా సవరణ పనులు పూర్తి చేస్తారు. సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 10వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ల జాబితాను తయారు చేస్తారు. 17న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఓటరుజాబితా సవరణలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను అక్టోబరు 17 నుంచి నవంబరు 30వ తేదీ వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 26 నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరిస్తారు. 2024 జనవరి 1న ఓటర్ల జాబితా సిద్ధం చేస్తారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

సర్వే ప్రధానాంశాలు

- 18 సంవత్సరాలు నిండిన వారితోపాటు 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారికి ఓటుహక్కు కల్పించడం.
- ఓటరు జాబితాలో డబల్ ఎంట్రీ, నకిలీ ఓట్లను గుర్తించడం.
- చనిపోయిన వారి మరణ ధృవీకరణ పత్రాన్ని పరిశీలించి జతచేసి ఓటును తొలగించడం.
- సర్వీసు ఓటర్లు (ఆర్మీ), ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలు సరిచేయడం.
- ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో తెలుసుకుని జాబితాలో ఉంచడం.
- ఒక పోలింగ్ బూత్‌లో గరిష్టంగా 1500 ఓట్లకు మించి ఉంటే కొత్త పోలింగ్ బూత్‌కు సిఫార్సు చేయడం.

జిల్లా అంతటా వర్షం





వర్షం రాకతో కడపలోని ప్రధాన రహదారి జలమయం, కోర్టు ఆవరణంలో...

- కలసపాడులో అత్యధికంగా 28.8 ఎంఎం వర్షం
- మంగళవారం సాయంత్రం కడపతోపాటు పలు చోట్ల భారీ వర్షం
- వర్షపు నీటితో జలమయమైన కడప ఆర్టీసీ బస్టాండ్

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి జిల్లావ్యాప్తంగా చిరుజల్లులతో కూడిన వర్షం ప్రారంభమయింది. ఈ వర్షం మధ్యాహ్నానికి ఎక్కువై జిల్లా అంతటా విస్తారంగా కురిసింది. సాయంత్రం 5 గంటలకు మరింత ఎక్కువై భారీ వర్షం కురిసింది. దీంతో కడప నగరంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. పలు చోట్ల డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహించాయి. ఆర్టీసీ బస్టాండంతా వర్షపు నీటితో నిండిపోయింది. ఆర్టీసీ బస్టాండ్ బయట ఉన్న ప్రధాన రహదారిలో మోకాటిలోతులో నీరంతా నిండి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కలసపాడులో అత్యధికంగా..

జిల్లాలో కలసపాడులో అత్యధికంగా 28.8 ఎంఎం వర్షం కురిసింది. కాశినాయనలో 22.6 ఎంఎం, ఎర్రగుంట్లలో 15.8 ఎంఎం, బీ కోడూరులో 14.8 , బద్వేలులో 13.2 , గోపవరంలో 10.8 , పోరుమామిళ్లలో 10.6 , సిద్దవటంలో 10.2 , రాజుపాలెంలో 10 , జమ్మలమడుగులో 9.6 , కొండాపురంలో 9.2 , మైదుకూరులో 8.8 , దువ్వూరు, సిద్దవటం, ఒంటిమిట్టలో 8.4 ఎంఎం వర్షపాతం నమోదయింది. దీంతోపాటు పలు మండలాల్లో వర్షం కురిసింది.

విత్తనాల సాగుకు అనుకూలం..

ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు, పెసలు, వేరుశనక్కాయలను రైతులకు సబ్సిడీతో పంపిణీ చేసింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తారు వర్షం కురిసింది. కొన్ని చోట్ల భారీ వర్షం కురిసింది. ఈ వర్షం పచ్చిరొట్ట విత్తనాల సాగుకు అనుకూలంగా ఉందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మరో రెండు మూడు రోజులు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్పడంతో రైతన్నల్లో ఆశల సాగు చిగురిస్తోంది.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

అఖిలపక్ష కమిటీ నేతలు, సర్వమత పెద్దల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న హరూన్ గ్రూప్ సంస్థల ఎండీ ఎస్‌బీ అహ్మద్‌బాషా

కడప కార్పొరేషన్ : మణిపూర్ రాష్ట్రంలో వెంటనే శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అఖిలపక్ష కమిటీ నేతలు, హిందూ, ముస్లిం, క్రిష్టియన్ మతాల పెద్దలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నూర్జహాన్ కల్యాణ మండపంలో హరూన్ గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌బీ అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండ వల్ల 150 మందికిపైగా బలి అయ్యారన్నారు. ఇటీవల మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలపై వీడియోలు బయటికి వచ్చాయని, ఇలాంటివి వందకుపైగా జరిగాయని అక్కడి సీఎం ప్రకటించడం అక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతున్నాయన్నారు. ఈ అమానవీయ ఘటనల పట్ల సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. జరిగింది ఎక్కడో కదా అని ఊరుకుంటే అది మనదాక చేరుతుందని హెచ్చరించారు. ఎక్కడైతే స్త్రీలు పూజింపబడుతారో, అక్కడ దేవతలు కొలువై ఉంటారని పురాణాలు చెబుతున్నాయని, స్త్రీలను పూజించి గౌరవించే మన దేశంలో ఈ తరహా ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. ప్రజలు క్షేమంగా ఉంటేనే ఏ దేశమైనా బాగుంటుందన్నారు. మనం ఏ మతం, ప్రాంతం, జాతి, తెగకు చెందినా...మనందరం మనషులమని, మన లో ప్రవహించేది ఒకటే రక్తమేనని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అయిన ఇలాంటి అమానుష ఘటనలను అందరం ముక్త కంఠంతో ఖండించాలన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడంలో మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్రం వెంటనే స్పందించి మణిపూర్‌లో ప్రజలకు రక్షణ కల్పించాలని, బాధితులైన వారికి పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. మణిపూర్ ప్రభుత్వంపై ప్రజలు నమ్మకం కోల్పోయారని, విధానపరమైన నిర్ణయాలతో మళ్లీ నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. అప్పటి వరకూ అందరం కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందుకు రాజకీయపార్టీలు, మీడియా, ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకారమందించాలని కోరారు. ఈ ఘటనలపై ముందుగా స్పందించిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్‌కు సభ ధన్యవాదాలు తెలిపింది. అంతకుముందు మణిపూర్‌లో బలైన వారి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రిగేషనల్ టౌన్ చర్చి ఫాదర్ మోహన్, ఫాదర్ సుబుద్ధి, సీఎస్ఐ సెంట్రల్ చర్చి ఫాదర్ మత్తయ్యబాబు, ముఫ్తీ రహిముల్లా ఖాన్, మహమ్మద్ అలీ బాగ్దాది, మౌల్వీ ఖాజీ షేక్ మహమ్మద్ అలీ రషాదీ, జిల్లా అర్చక సమాఖ్య నాయకులు విజయ్ భట్టర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్లు ఎం.సుబ్బారెడ్డి, షఫీ, ఆ పార్టీ నేతలు బంగారు నాగయ్య, సుభాన్‌బాషా, ఎన్.సుబ్బారెడ్డి, టీడీపీ నాయకుడు జిలానీబాషా, కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య, నజీర్ అహ్మద్, సంఘసేవకుడు సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత



మృతుని కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీఓ

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామానికి చెందిన బి.కమాల్ బాషా (71) ఈ నెల 21న రైల్వేకోడూరు సమీపంలోని చిన్న ఓరంపాడు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆర్డీఓ ధర్మ చంద్రారెడ్డితో కలిసి మృతుని నివాసానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడి భార్య షాకీరున్‌కు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత త్వరగా స్పందిస్తున్నారనడానికి మృతులకు చెక్కులు పంపిణీ చేసిన వైనమే నిదర్శనమన్నారు. కేవలం నాలుగు రోజుల్లోనే మృతుని కుటుంబ సభ్యులకు చెక్కు అందించడం హర్షణీయం అన్నారు. గత ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఏళ్లు గడిచినా చెక్కులు ఇచ్చేవారు కాదన్నారు. తక్షణం స్పందించే నాయకుడు ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మంచి మనసున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బాధితుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యుల నిరసన

మదనపల్లె : మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై అత్యాచారం చేసి, వారికి సంబంధించిన వ్యక్తులను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని నవ యువ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టౌన్‌బ్యాంక్ సర్కిల్‌లో మణిపూర్ మహిళలపై పైశాచిక దాడులను ఖండిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు భాస్కర్, ఎం.మధుబాబు, జవహర్ బాషా మాట్లాడుతూ ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించినా అక్కడి రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. గిరిజన స్త్రీలపై అఘాయిత్యం చేసిన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. కేంద్రప్రభుత్వం, మణిపూర్‌లోని రాష్ట్రప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో మైతీలు, కుకీలు వర్గాల మధ్య గొడవలు సృష్టించాయన్నారు. మణిపూర్‌లో దమనకాండను బయటకు రానివ్వకుండా ఇంటర్నెట్ సేవలను సైతం నిలుపుదల చేసిన కేంద్రప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నవ యువ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం



బిడ్డను పరీక్షిస్తున్న ఈఎంటీ తేజస్విని

బద్వేలు అర్బన్ : 108 వాహనంలో మంగళవారం కడపకు తరలిస్తున్న ఓ మహిళకు పురిటినొప్పులు అధికం కావడంతో 108 ఈఎంటీ ప్రసవం చేశారు. సదరు మహిళ ఆడబిడ్డకు జన్మనివ్వగా ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లెకు చెందిన కె.సంధ్యకు నెలలు నిండటంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కాన్పు కష్టంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు 108 వాహనంలో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో పురిటినొప్పులు అధికమయ్యాయి. ఈ సమయంలో ఈఎంటీ తేజస్విని చాకచక్యంగా వ్యవహరించి మహిళకు ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్యం కోసం వారిని కడప రిమ్స్‌లో చేర్పించారు. 108 వాహనంలో ప్రసవం చేసి తల్లీబిడ్డను కాపాడిన పైలట్ శేఖర్, ఈఎంటీ తేజస్వినిలకు మహిళా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ

దువ్వూరు : మండలంలోని మీర్జఖాన్‌పల్లెకు చెందిన రైతు పసల లాల్ షరీఫ్ ట్రాక్టర్ ట్రాలీ అపహరణకు గురైందని మంగళవారం దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తన ట్రాక్టర్ ట్రాలీని అపహరించారని, ట్రాలీ రూ.2 లక్షలు విలువ చేస్తుందని ఆయన చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆర్‌టీపీపీకి ఎంవీ రమణారెడ్డి పేరు పెట్టాలి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య

కడప కార్పొరేషన్ : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్‌టీపీపీ)కి దివంగత ఎమ్మెల్సీ ఎంవీ రమణారెడ్డి పేరు పెట్టాలని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య కోరారు. మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాయలసీమకు ఎంవీ రమణారెడ్డి చేసిన సేవలను గుర్తించి ఆర్‌టీపీపీకి ఆయన పేరు పెట్టాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

• అయ్యో పాపం

అన్నాచెల్లెళ్లకు పాము కాటు

అన్న మృతి, మృత్యువుతో పోరాడుతున్న చెల్లి



మృతి చెందిన నవదీప్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భవ్యశ్రీ

సింహాద్రిపురం : అయ్యో పాపం.. అల్లారుముద్దుగా పెరుగుతున్న ఆ చిన్నారులను విధి చూపు చూసింది. అన్నా,చెల్లెలిని పాము కాటు వేసింది. దీంతో అన్న మృతి చెందగా, చెల్లెలి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అంకాలమ్మగూడూరుకు చెందిన రామాంజనేయులు తొండూరు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. సొంత గ్రామమైన అంకాలమ్మ గూడూరులో నివాసముంటున్నాడు. ఇతనికి ముగ్గురు సంతానం. నవదీప్(12), భవ్యశ్రీ,(4), రెండు నెలల బాబు (ఇంకా పేరు పెట్టలేదు) ఉన్నారు. నవదీప్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి నవదీప్, చెల్లెలు భవ్యశ్రీ వారి ఇంటిలో నేలపై నిద్రిస్తుండటంతో.. నివాసంలోకి పాము వచ్చిన విషయం గమనించి కేకలు వేయడంతో విద్యార్థి తాత పామును చంపేశారు. అయితే నిద్రలో ఉన్న నవదీప్‌ను అప్పటికే పాము కరిచింది. దీంతో నవదీప్ తాతతో నాకు తల తిరుగుతోందని.. శ్వాస ఆడటం లేదని.. మరోపక్క భవ్యశ్రీ విరేచనాలు అవుతుండటంతో అప్పటికి వారిని పాము కరిచిందనే అనుమానంతో హుటాహుటిన పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే నవదీప్ మృతి చెందారు. చెల్లెలు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. ఇలా పాము కాటుకు అన్న మృతి చెందడం, చెల్లెలు పరిస్థితి విషమంగా ఉండటంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యులు కన్నీళ్లపర్యంతమయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

యూఏఈలో అన్నమయ్య జిల్లా యువకుడి మృతి

ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయంతో స్వస్థలానికి మృతదేహం



మునిరాజు (ఫైల్)

కడప కార్పొరేషన్ : ఎన్నో ఆశలు.. కోరికలతో పొట్ట చేత పట్టుకొని జీవనోపాధి కోసం ఏడారి దేశమైన యూఏఈ(దుబాయ్)కి వెళ్లిన అన్నమయ్య జిల్లాకు చెందిన యువకుడు కేవలం 25 రోజులకే శవమై తిరిగొచ్చాడు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సభ్యుల సహకారంతో అతని మృతదేహాన్ని స్వస్తలానికి తీసుకొచ్చారు. వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం నామాలపల్లికి చెందిన జి.మునిరాజు(22) అనే యువకుడు ఇటీవల దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ ఈనెల 14వ తేదీన అనుమానాస్పద రీతిలో ఉరికి వేలాడుతూ కనిపించాడు. మునిరాజు బంధువొకరు ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ సయ్యద్ అక్రం దృష్టికి తీసుకొచ్చి, అతని మృతదేహాన్ని స్వస్థలం పంపేందుకు సహాయం చేయాలని అభ్యర్థించాడు. దీనిపై వెంటనే స్పందించిన ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ప్రావిజనల్ కో ఆర్డినేటర్ టి. మోహన్‌రావు భారత రాయబార అధికారులతో మాట్లాడి ఎంబసీ ద్వారా ఉచిత టికెట్ ఇప్పించారు. ఈ మేరకు మునిరాజు మృతదేహం ఈ నెల 24వ తేదీన యూఏఈ నుంచి ఎయిర్ ఇండియా ద్వారా 25న చెన్నైకి చేరింది. అక్కడి నుంచి ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ఉచిత అంబులెన్స్‌లో నామాలపల్లికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సయ్యద్ అక్రం, మోహన్‌రావు మాట్లాడుతూ చిన్నవయసులో మునిరాజు అనుమానాస్పద రీతిలో మరణించడం బాధాకరన్నారు. మృతుడి అన్న శ్రీకాంత్ మాట్లాడుతూ ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ద్వారా ప్రవాసాంధ్రుల సమస్యలు పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, భారత ఎంబసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు సాయం చేసిన ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

సూపరింటెండెంట్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల వారి కార్యాలయము: కడప.

లేఖ నం:12/E1/2023 తేది: 25.07.2023

పత్రికా ప్రకటన

నియామకపు ప్రకటన నెం.01/2023 ను అనుసరించి ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కడప నందు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకొరకు Emergency Medical Technician పోస్టులకు ఇచ్చిన Notification ను గౌరవ హైకోర్టు ఆదేశాల మేరకు రద్దు చేయడమైనది. సవరించిన విద్యార్హతలతో తిరిగి RENOTIFICATION మరియు అన్ని వివరములు www.kadapa.ap.gov.in వెబ్ సైట్ నందు పొందుపరచడమైనది.

సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కడప.

వ్యక్తిపై కత్తితో దాడి

చాపాడు : మండల కేంద్రమైన దువ్వూరుకు చెందిన పఠాన్ నాయబ్ ఖాన్(27) అనే వ్యక్తిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కళ్లలో కారం చల్లి కత్తితో దాడి చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఏడాది క్రితం పఠాన్ నాయబ్ ఖాన్‌ను తన అన్న సడుగుడు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు అయింది. ఈ కేసులో రాజీకి ఒప్పుకోలేదు. సోమవారం రాత్రి పఠాన్ నాయబ్ ఖాన్ బైక్‌లో మైదుకూరు నుంచి దువ్వూరుకు వెళుతున్నాడు. ఈ క్రమంలో చాపాడు మండల పరిధిలోని జడ్డీ కొట్టాలు గ్రామ సమీపంలోని కాశినాయన గుడి దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ల ద్వారా వెంబడించి పఠాన్ నాయబ్ ఖాన్ కళ్లలో కారంపొడి చల్లి కత్తితో దాడి చేశారు. దీంతో గాయపడిన పఠాన్ నాయబ్ ఖాన్‌ను 108 వాహనంలో స్థానికులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీరభద్రస్వామి సేవలో నైమిశారణ్య పీఠాధిపతి



శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి

చాపాడు : పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామిని హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు, శ్రీకాకుళం జిల్లా నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో వీరభద్ర స్వామి సన్నిధిలోని ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామి వారి లీలా విలాసం ప్రవచనాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివేకానందరెడ్డిది ఆస్తి తగాదా హత్య



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిది రాజకీయ హత్య కాదని, అది ఆస్తి తగాదా హత్య మాత్రమేనని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలోని తన స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లో మీడియాలో ఎంపీ అవినాష్‌రెడ్డిని దోషిగా చూపిస్తూ అనేక కథనాలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చెడ్డపేరు తెచ్చేలా వార్తలు ఇస్తున్నాయన్నారు. వివేకానందరెడ్డి మృతి రాజకీయంగా, వ్యక్తిగతంగా జగన్‌మోహన్‌రెడ్డికి తీవ్ర నష్టమని నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. ఆయనే బతికిఉంటే జిల్లా రాజకీయాలు ఆయనే చూసుకునే వారన్నారు. సీబీఐ అన్ని కోణాల్లో విచారణ చేపట్టకుండా ఒకే కోణంలో విచారణ చేపడుతోందన్నారు. వివేకానందరెడ్డి రెండవ వివాహం గురించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. ఆయన చెక్‌పవర్ రద్దు చేయడం వల్ల చాలా ఇబ్బంది పడ్డారన్నారు. అవినాష్‌రెడ్డికి, ఆయన తండ్రికి హత్యలో ఎటువంటి సంబంధం లేదన్నారు. ఇది కేవలం ఆస్తి కోసం జరిగిన హత్య అన్నారు. వైఎస్ కుటుంబంతో తమకు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందని, ఎలాంటి అపాయింట్‌మెంట్ లేకుండా నేను మా అమ్మ కృష్ణమ్మ ఆ ఇంటికి వెళతామని, ఆ కుటుంబం, అవినాష్ కుటుంబం గురించి మాకు తెలుసన్నారు. ఎల్లో మీడియా ఎంతగా విషప్రచారం చేసినా ప్రజలు నమ్మరన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

రాయచోటి టౌన్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో గల గ్రూప్–4 సర్వీసెస్ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ఉత్తీర్ణత జాబితాను విడుదల చేశారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 8వ తేదీలోగా లిఖిత పూర్వకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలియజేయాలని ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లా కార్యాలయ అధికారి గంగాధర్‌గౌడ్ సోమవారం తెలియజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 51 మండలాలకు మండలానికి ఒకరు చొప్పున రోస్టర్, మెరిట్ లిస్ట్ ప్రకారం ఎంపిక చేశామని తెలిపారు. ఎంపిక లిస్టు kadapa.ap.gov.in వెబ్ సైట్ లో ఉంచామని పేర్కొన్నారు. అభ్యంతరాలు రాని పక్షంలో ఆగస్టు 8వ తేదీ తరువాత వారి సర్టిఫికెట్ల పరిశీలన జరుగునని వివరించారు.

పుదుచ్చేరి మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుకున్న బాటిళ్లు, నిందితుడితో పోలీసులు



బీర్లు పారబోస్తున్న ఏపీఎస్‌బీసీఎల్ ఎస్ఐ, సిబ్బంది

ఎర్రగుంట్ల : ముంబై ఎక్స్‌ప్రెస్ రైలులో నుంచి అక్రమంగా తీసుకుని వస్తున్న పుదుచ్చేరికి చెందిన 70 మద్యం బాటిళ్లను ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నట్లు అసిస్టెంట్ సెక్యూరిటీ కమాండెంట్ బీసీవీ రాజు తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో ఆర్‌పీఎఫ్ సీఐ వేంకటేశ్వర్లు, ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డిలతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. వీరపునాయునిపల్లె మండల పరిధిలోని ఉరటూరు గ్రామానికి చెందిన డోలు సాయిప్రతాప్ పుదుచ్చేరి నుంచి 70 మద్యం బాటిళ్లు తీసుకుని వస్తుండగా పట్టుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ బాటిళ్ల విలువ రూ.40 వేలు ఉంటుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడులలో ఆర్‌పీఎఫ్ సీఐ వేంకటేశ్వర్లు, ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డిలతో పాటు జీఆర్‌పీ పోలీసులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బీరు బాటిళ్ల ధ్వంసం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగర శివార్లలోని బుగ్గలేటిపల్లె గ్రామం ప్రభుత్వ మద్యం దుకాణంలోని కాలం చెల్లిన బీర్లను ధ్వంసం చేశారు. ఏపీఎస్‌బీసీఎల్ ఎస్ఐ జహీర్, డిపో మేనేజర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వాటిని పగులగొట్టారు. వాటి విలువ రూ.లక్ష ఉంటుంది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణంలో కాలం చెల్లిన మద్యాన్ని, బీర్లను ప్రజలకు హాని కలగకుండా తనిఖీలు చేసి ధ్వంసం చేస్తామన్నారు.

జనారణ్యంలోకి జింక



జింకను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధి 1వ వార్డులోని ప్రకాశ్‌నగర్ కాలనీలోకి ఇళ్ల మధ్యలోకి ఓ జింక వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశ్‌నగర్ కాలనీ సమీపంలో ఉన్న మైలవరం కాలువ వెంట గత కొన్ని రోజులుగా జింకలు తిరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఓ జింక కాలనీలోని ఇళ్ల మధ్యకు వచ్చింది. కుక్కలు తరుముతూ ఉండటంతో ఇళ్ల మధ్యలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ జింకను స్థానికులు పట్టుకున్నారు. ఈ కాలనీకి చెందిన డాక్టరు బాలాజీ ప్రొద్దుటూరు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు ఎర్రగుంట్లకు వచ్చి జింకను పట్టుకుని వెళ్లారు.

కుక్కల దాడిలో..

మదనపల్లె : మండల పరిధి మాలేపాడు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం ఓ జింక కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడింది. గమనించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో.. ఎఫ్ఆర్వో మదన్‌మోహన్‌రెడ్డి, సిబ్బందితో కలిసి గాయపడ్డ జింకను వైద్యసేవల నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ జంతువైద్యశాలకు తరలించారు. అక్కడ డాక్టర్ షిరీన్‌లారెన్స్ వైద్యచికిత్సలు అందించారు. జింక అడవిలో బాగా మేత మేసి ఉండటంతో కుక్కలు వెంటపడితే పరుగెత్తలేకపోయిందని, దాడిలో జింక కడుపు భాగంలో, మెడమీద తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. దీంతో జింకకు యాంటీ రేబిస్ ఇంజెక్షన్‌తోపాటు కడుపునకు కుట్లువేసి గాయాలకు చికిత్స అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం జింక పరిస్థితి విషమంగానే ఉందని, అటవీశాఖ అధికారుల సంరక్షణలో ఉంచినట్లు చెప్పారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

పెద్దముడియం : మండలంలోని దిగువకల్వటాల గ్రామంలో గత నెల 2వ తేదీ అప్పుల బాధతో గువ్వల గుర్రప్ప అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు ఆత్మహత్యపై విచారణ కమిటీ సభ్యులైన ఆర్డీవో శ్రీనువాసులు, తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి, మండల వ్యవసాయాధికారి.. రైతు కుటుంబ సభ్యులను, గ్రామస్తులను విచారణ చేశారు. ఎవరి దగ్గర ఎంతెంత డబ్బులు అప్పులు చేశాడు, నిజంగా అప్పులు చేశాడా లేదా అని అప్పులు ఇచ్చిన వారిని విచారించినట్లు విచారణ కమిటీ సభ్యులు తెలిపారు.